కథ

# అంటుముడి

బి.పి.కరుణాకర్

**అమ్మా,**

నీ ఉత్తరం అందింది. చాలా పెద్ద ఉత్త
రం రాశావు. నా ముప్పయి అయిదేళ్ల జీవి
తంలో నీ నుండి అంత పెద్ద ఉత్తరం
అందుకోవడం ఇదే మొదటిసారి. నువ్వు
నా ఎదురుగా కూర్చుని ఎన్నో సంగతులు
చెబుతున్నట్టుగా అనిపించింది. చదువుతు
న్నంతసేపూ నా కళ్లల్లో తడి ఆరలేదు.
చివర్లో దుఃఖం ఆపుకోలేక ఏడ్చేశాను.
నువ్వు ఉర్దూ బాగా మాట్లాడుతుంటావు.
చక్కగా రాయడం కూడా చూశాను.
తెలుగు ఇంత మంచిగా రాయగలవని నీ
ఉత్తరం చూశాకగాని తెలుసుకోలేకపో
యాను. నీ ఉత్తరాన్ని పదే పదే చదువు
తున్నాను.

అప్పుడప్పుడు చేస్తూన్న ఈ ఉద్యోగం
మానేసి వచ్చి నీ దగ్గర ఉండిపోదామ
నిపిస్తుంటుంది. రాలేను. నువ్వు నా
కోసం, చెల్లెలి కోసం పడిన కష్టాలు
తల్చుకుంటే మనసు బాధతో నిండి
పోతుంది. నీ బాకీ తీర్చుకోగలనో, లేదో?


పిల్లలు బావున్నారు. బాగా చదువు
కుంటున్నారు. నా భార్య బావుంది. మని
షం మారలేదు. మారుతుందని అనుకోవ
డం మానేశారు. జీవితం నాకు నిటారుగా
లేదు. తలకిందులుగా ఉంది. వచ్చిన
జీతం వచ్చినట్టు ఆమె చేతికి ఇవ్వవల
సిందే. కొన్నిసార్లు స్కూటరు పెట్రోలుకు
కూడా డబ్బులుండవు. నాలుగు కిలోమీ
టర్లు ఏ ట్రాఫిక్ జామ్ లేకుండా నడుచు
కుంటూ వెళ్లిపోతుంటాను. అసలు ఫైన్
ఆర్ట్స్ ఎందుకు తీసుకున్నానా అనిపిస్తుం
టుంది. పార్ట్ టైంగా మరో రెండు చోట్ల
పని చేస్తున్నాను. ఎవరూ సరిగా డబ్బులి
వ్వరు. నాకే అనుకుంటే నా సీనియర్లను
కూడా అలానే ఇబ్బందులు పెడుతుంటారు.

అసలు విషయానికి వస్తాను. నిజానికి
ఖాన్‌సాబ్ దగ్గరకు వెళ్లడం నాకు ఇష్టం
లేదు. నీ మాట తీసేయలేక పోయిన ఆది
వారం ఉదయం పది గంటలప్పుడు వెళ్లా
ను. పెద్ద బంగళా లాటి ఇల్లు. ఎత్తయిన
ప్రహరీగోడ. కాపలాదార్లు. దున్నపోతు
లాంటి కుక్కలు- ఇవన్నీ చూశాక నాకు
తెలియకుండా నేను కుంచించుకుపోయినట్టు
అనిపించింది.

నా ఆఫీసు విజిటింగ్ కార్డు ఇచ్చాను.
ఆ కాఫీసు నుండి అనేసరికి లోపలికి వెళ్ల
డానికి ప్రవేశం దొరికింది. విజిటర్స్ గదిలో
కూర్చోబెట్టి కాఫీ ఇచ్చారు. అప్పటి ఇల్లే.
ఎన్నో మార్పులు చేసి అందంగా అలంక
రించారు. నేను, చెల్లాయి చిన్నప్పుడు ఆ
ఇంట్లో ఆడుకున్నామంటే ఎవరి మాటో
ఎందుకు, నా మటుకు నాకే నమ్మకం
కలగలేదు. అన్నిటికంటే నన్ను ఆశ్చర్య
పరిచిన విషయం ఏమిటంటే నీ క్యారికే
చర్, అప్పుడెప్పుడో నేను పిచ్చిగీతలు
రాయడం నేర్చుకుంటున్న సమయంలో
వేసింది, చాలా సంవత్సరాలు గడిచిపోయి
నా ఈ మధ్యనే వేసినట్టుగా ఉంది. లామి
నేట్ చేయడం వలనేమో మరింత అందం
గా ఉన్నట్టు అనిపించింది. నా మటుకు
నాకు కొత్తగా ఉన్నట్టు అనిపించసాగింది.

ఖాన్‌సాబ్ ఇంకా రాలేదు. మరొకసారి
కాఫీ తీసుకువచ్చి ఇచ్చారు. వేడిగా ఉన్నా
మూడు గుక్కల్లో తాగేశాను. ఆకలిగా
ఉంది. రాత్రి భోజనం చేయలేదు. రాత్రి
నేను ఇంటికి రావడం ఆలస్యం అయితే
ఎక్కడో తిని వస్తానని మిగిలింది కుక్కకు
వేసింది. నా మీద కోపం అని అనుకోను.
కోప్పడి కోప్పడి విసుగెత్తిపోయి ఉండాలి.
కోప్పడడం మానేసింది. అప్పుడప్పుడు
అనిపిస్తుంటుంది, మిమ్మల్నందరినీ కాదని
ఆమెనా ఎంతగానో ప్రేమించి పెళ్లి చేసుకు
న్నానని!

క్యారికేచర్ అంటే నాకు వెంటనే గుర్తు



వచ్చేది ధీరేంద్రావారి. తెలుగు సాహిత్యం
తో నీకు అట్టే పరిచయం లేదు. కాబట్టి
నువ్వతని పేరు విని ఉండవు. ఇప్పుడ
తనికి యాభయి అయిదేళ్లు పయినే
ఉంటాయి. ఇక్కడే ఉంటాడు. దాదాపు
ప్రతి తెలుగు పత్రికలో అతని వ్యాసాలు,
పజిల్స్, సీరియల్స్ వస్తుంటాయి. చాలా
రచనలు మిగతా భాషల్లోకి కూడా తర్జుమా
చేయబడ్డాయి. భాష బావుంటుంది.

నాకు ఆ గదికి నీ క్యారికేచరే ప్రత్యేక
ఆకర్షణలా ఉంది. సంతోషంతోనో, దుఃఖం
తోనో నాకు ఏడుపు వస్తోంటే బలవంతం
గా ఆపుకున్నాను.

నేను వచ్చిన పని వేరు.

ఆ ఇంటి ఎదురు నుండి నేను అనేక
సార్లు వెళ్లాను. ఆ ఇంటి వయిపు చూడా
లని కూడా అనిపించేది కాదు. ఇప్పుడు ఆ
ఇల్లు ముఖ్యంగా నీ బొమ్మ ఉన్న ఆ గది

చెప్పే విధానం కూడా చక్కగా ఉంటుంది. అతను రాసేవి చాలామటుకు ఇంగ్లీషులో నుండి మక్కీకి మక్కీ తస్కరించబడినవి అయినా అతనంటే నాకుఅభిమానం పోలేదు.

ధీరేంద్రాచారి అప్పుడప్పుడు మా పత్రి కాఫీసుకు వస్తుంటాడు. నాకు లాగా మా ఆఫీసులో అతనికి అభిమానులు ఉన్నారు. అతను రాగానే అతని చుట్టూ చేరి పొగడ్త లతో ముంచెత్తేస్తుంటారు. అతనితో నాకూ మాట్లాడదామని ఉండేది. అందరిలో నాకు అవకాశం అందేది కాదు. సబ్ ఎడిటర్ స్థాయికి తక్కువ వ్యక్తులతో మాట్లాడడానికి అతను ఆసక్తి చూపించేవాడు కాదు. ఈ మధ్యే ఎలాగో ఒకలా అతని దగ్గరకు వచ్చి నన్ను నేను పరిచయం చేసుకుని అతని క్యారికేచర్, నేను ఎంతో శ్రద్ధగా వేసింది, అతనికి అందించాను. చుట్టి ఉన్న షీటు విప్పాడు. అది వేయడానికి నేనెంత కష్టప డ్డానో అతనికి తెలిసి ఉంటే నన్ను తప్పక అభినందించేవాడే. మామూలు కాయితం చూసినట్టుగా చూసి షీటు చుట్టి చేత్తో పట్టుకున్నాడు. మర్యాదకోసమయినా 'థేంక్స్' అని కూడా చెప్పలేదు. అతని తత్వమే అంతేమో. చాలా మంది రచయి తలు వాళ్ల రాతలంత విశాల దృక్పథం కలి గినవాళ్లు కారు. ఎంతో తేడా ఉంటుంది.

అతని క్యారికేచర్ ఎలా ఉందో అతని నోట విందామని అతను మా ఆఫీసు మెట్లు దిగుతోంటే నేనూ అతని వెంట దిగ సాగాను. అతని పక్కనే మా చీఫ్ సబ్ ఎడిటర్ ఉన్నాడు. నేను వేసిన అతని క్యారికేచర్ ఎలా ఉందో తెలుసుకుందామనే ఉద్దేశం తప్ప వేరేమీ లేదు. మెట్లు దిగు తున్న వాడల్లా వెనక్కి తిరిగి నన్ను చూసి మా చీఫ్ సబ్ ఎడిటర్‌తో, "మీ వాడు నా వెంట బడ్డాడు, డబ్బులకోసమా? వంద రూపాయలిచ్చేదా?" అన్నా డు. నేను వింటున్నానని ఇద్దరికీ తెలు సు. "వాడి ముఖం. ఇవ్వక పోతేనేం?" మా వాడి జవాబు. అభి మానాలు ఇంత నిర్దయగా ఆర్పేస్తా రని నేను ఊహిం చలేదు. వెనక్కి తిరిగాను. ఆ సాయంత్రం ఆఫీసు నుండి బయటకు వస్తు న్నప్పుడు మా రిసెప్షనిస్టు బల్ల పక్కనే ఉన్న చెత్తబు ట్టలో ధీరేంద్రాచారి క్యారికే చర్‌ను చూశాను. ఎంతో ఇష్టపడి వేసిన నేనే దాన్ని చించి ముక్కలు చేసి బ యటకు వచ్చాను.

ఖాన్‌సాబ్ విషయానికి వస్తాను. అరగంటకు పయిగా ఎదురు చూశాక అతను వచ్చాడు. లేచి నుంచోబోతోంటే కూర్చోమన్నట్టు చేయిందించాడు. అతను కూర్చున్నాక నేను కూర్చున్నాను. అతనిలో అట్టే మార్పు లేదు. మునుపటి మీద కొద్దిగా లావెక్కాడు. తల మీద జుట్టు నెరిసింది. నా కార్డు చూసి, "ఇంటర్వ్యూ కావాలా? ఇవేళ నాకంత సమయం లేదు. కాఫీ తాగుతావా?" అడిగాడు.

అతను నన్ను గుర్తు పట్టినట్టులేదు.

"కాఫీ ఇప్పటికే మీ ఇంట్లో రెండుసార్లు తాగాను. ఇహ వద్దు. నేను ఇంటర్వ్యూ చేయడానికి రాలేదు... మీకు నేను గుర్తు న్నానా?"

నా ముఖంలోకి పరిశీలనగా చూసి తల అడ్డంగా ఆడించాడు.

"రహీమ్‌ను".

నా పేరు కొత్తగా వింటున్నట్టుగా అని పించిందేమో! అతని దగ్గరకు రాకుండా ఉండవలసింది.

"నేను ఫాతిమాబేగం కొడుకును".

"ఏ ఫాతిమా?"

"గుంటూరు. గుండారావుపేట"

గదంతా కలయచూశాడు. మేమిద్దరం తప్ప ఎవరూ లేరు.

"మస్తాన్ దర్గా దగ్గర..."

"నాకు నువ్వు తెలియదు. మీ అమ్మ తెలియదు. దయచేసి బయటకు వెళ్లు. మళ్లీ ఎప్పుడూ మా ఇంటికి రాకు. వస్తే మర్యాదగా ఉండదు..." లేచి నుంచు న్నాడు.

నేను నించున్నాను. నా కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. కన్న కొడుకుగా నన్ను గుర్తించడం లేదు. పోనీ, అతన్నెంతో పయికి తీసుకువచ్చిన నిన్ను గుర్తించడానికి ఇష్టపడడం లేదు.

గోడకు తగిలించి ఉన్న క్యారికేచర్ చూపిస్తూ "అది ఎవరు వేశారో ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి..." అంటున్నాను నా మాటలు పూర్తి చేయలేదు. టీ పాయ్ మీదున్న గ్లాసు అందుకుని క్యారికేచర్ వైపు విసిరాడు.

నాకు అక్కడ క్షణమయినా ఉండబుద్ధి కాలేదు. బయటకు వచ్చేశాను. నువ్వు ఉత్తరంలో రాసిన చాలా ప్రశ్నలకు జవాబు లు రాశాననే అనుకుంటున్నాను.

అమ్మా,

నా బాధ ఒక్కటే. నీకు దొరికి నంత మంచి నాన్న నాకెందుకు దొరకలేదా అని!

మళ్లీ ఉత్తరం రాస్తాను.

ప్రేమతో

నీ

కుమారుడు

రహీమ్

